1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
RNI : APTEL / 2023 / 89152
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక


Good for Health
Best for Readers
THE POWER OF PEN RK

సంపుటి : 2 సంచిక : 297 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ మంగళవారం 21 అక్టోబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 297 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Tuesday 21 October 2025 PAGES : 8 PRICE : 3/-

## ప్రస్తుతం 3 జిల్లాల్లోనే మావోయిస్టుల ఉనికి

### ప్రధాని మోదీ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 20)

ఉగ్రవాదం, మావోయిస్టులకు భారత్‌లో చోటు లేదని ప్రధాని మోదీ అన్నారు. మావోయిస్టు రహిత దేశం దిశగా తమ ప్రభుత్వం ముందుకెళ్తోందని తెలిపారు. వారి ఏరివేతకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ ఏడాది మావోయిస్టుల నుంచి విముక్తి పొందిన 100కి పైగా జిల్లాలు ఆనందంగా దీపావళి వేడుకలు నిర్వహించుకుంటాయని పేర్కొన్నారు.గోవా తీరంలో నౌకాదళ సిబ్బందితో ప్రధాని దీపావళి వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రతా దళాల స్థైర్యాన్ని ప్రశంసించారు. "మావోయిస్టులు.. అభివృద్ధి నిరోధకులుగా మారారు. వారి ఏరివేతకే ఆపరేషన్ కగార్ చేపట్టాం. భద్రతా దళాల ధైర్యం కారణంగానే దేశం మరో ప్రధాన మైలురాయిని సాధించింది. 11 ఏళ్లక్రితం నక్సల్స్ 125 జిల్లాల్లో విస్తరించి ఉన్నారు. ప్రస్తుతం 3 జిల్లాలకే పరిమితమయ్యారు. మావోయిస్టుల రహితంగా దేశాన్ని మార్చడమే మా లక్ష్యం. 100కు పైగా జిల్లాల ప్రజలు మావోయిస్టుల నుంచి విముక్తి పొంది స్వేచ్ఛగా ఊపిరి తీసుకుంటున్నారు. వేల మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు" అని మోదీ తెలి పారు."గతంలో కొన్ని ప్రాంతాల్లో మావోయిస్టులు కనీస సౌకర్యాలు లేని దుస్థితిని తీసుకువచ్చారు. పాఠశాలలు, ఆసుపత్రులను పేల్చివేసి, వైద్యులను కాల్చి చంపిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇప్పుడు మారుమూల ప్రాంతాల్లోనూ అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. కొత్త పాఠశాలలు, ఆస్పత్రులతో చిన్నారులు నూతన భవిష్యత్తును నిర్మించుకుంటారు. ఈ విజయం మొత్తం భద్రతా దళాలదే. దేశంలోని అనేక జిల్లాల్లో ప్రజలు తొలిసారిగా దీపావళిని గర్వంగా, గౌరవంగా నిర్వహించుకుంటున్నందుకు నేను చాలా సంతోషిస్తున్నా" అని మోదీ పేర్కొన్నారు. -మిగతా 2లో

## శ్వేత సౌధంలో మళ్లీ మాటల యుద్ధం: పుతిన్ చెప్పిన దానికి ఒప్పుకోవాలని జెలెన్‌స్కీపై ట్రంప్ ఒత్తిడి



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 20)

అమెరికా అధ్యక్ష భవనమైన శ్వేత సౌధంలో శుక్రవారం ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీకి చేదు అనుభవం ఎదురైంది. పుతిన్ ప్రతిపాదించినట్లు దొనెట్స్క్ ప్రాంతాన్ని రష్యాకు అప్పగించి యుద్ధాన్ని వీలైనంత త్వరగా ముగించాలని ఆయనపై ట్రంప్ తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చారు. బహిరంగ వేదికలపై కీవ్‌కు తోమహాక్ క్షిపణులు ఇచ్చి పుతిన్‌ను ఇబ్బందిపెడతానని చెప్పిన ట్రంప్.. తనతో సమావేశ సమయంలో పుతిన్‌కు అనుకూలంగా మాట్లాడటంతో అవాక్కవడం ఉక్రెయిన్ అధినేత వంతైంది. ఈ డీల్‌కు అంగీకరించకపోతే రష్యా అధినేత ఉక్రెయిన్‌ను సర్వనాశనం చేస్తాడని ట్రంప్ బెదిరించినట్లు తెలుస్తోంది. ఈ భేటీలోని రహస్య వివరాలను ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక కథనంలో పేర్కొంది.

ట్రంప్-జెలెన్‌స్కీ మధ్య చర్చ వాడీవేడిగా జరిగినట్లు పేర్కొంది. ఒక దశలో ఇద్దరు నాయకులు స్వరాలు పెంచుకొని మాట్లాడుకొన్నట్లు ఫైనాన్షియల్ టైమ్స్ కథనం వెల్లడించింది. ఆ సమయంలో యుద్ధ భూమిలో పరిస్థితి తెలియజేస్తూ ఉక్రెయిన్ బృందం ఇచ్చిన మ్యాప్‌లను ట్రంప్ పక్కన పేట్టేసి డాన్‌బాస్ ప్రాంతాన్ని రష్యాకు అప్పగించాలని ఒత్తిడి చేసినట్లు వెల్లడించింది. పుతిన్ తలుచుకుంటే మిమ్మల్ని నాశనం చేస్తాడని ఒక దశలో ట్రంప్ హెచ్చరించారు. రష్యా ఆర్థికవ్యవస్థ చాలా బలంగా ఉందని ఆయన జెలెన్‌స్కీకి చెప్పారు. అటు శ్వేత సౌధం.. ఇటు జెలెన్‌స్కీ బృందం ఈ కథనంపై స్పందించలేదు.

జెలెన్‌స్కీతో భేటీకి ముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ , రష్యా అధినేత పుతిన్ మధ్య సుదీర్ఘ ఫోన్‌కాల్ సంభాషణలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చినట్లు శ్వేతసౌధం -మిగతా 2లో

## భారత్ అలా చెబితే.. భారీ టారిఫ్‌లు కట్టాల్సిందే: ట్రంప్ మరో హెచ్చరిక



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 20)

రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేసేందుకు భారత్ అంగీకరించిందంటూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. దీన్ని భారత్ తోసిపుచ్చినా.. ట్రంప్ మళ్లీ అదే పాట పాడారు. అంతేకాదు.. రష్యా చమురు కొనుగోళ్లు ఆపేంతవరకు న్యూదిల్లీ భారీ టారిఫ్‌లు చెల్లించక తప్పదని మరోసారి హెచ్చరించారు. తన అధికారిక విమానం ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "రష్యా నుంచి చమురు కొనుగోళ్లు ఆపేస్తామని భారత ప్రధాని నరేంద్రమోదీ నాతో స్వయంగా చెప్పారు" అని ట్రంప్ అన్నారు. అయితే, ఈ వ్యాఖ్యలను భారత్ తిరస్కరించిన విషయాన్ని మీడియా ప్రశ్నించగా.. "ఒకవేళ భారత్ అలా చెప్పాలనుకుంటే (మోదీ-ట్రంప్ ఫోన్‌కాల్‌ను ఉద్దేశిస్తూ) మాత్రం.. వారు భారీస్థాయిలో టారిఫ్‌లు చెల్లిస్తూనే ఉంటారు. కానీ భారత్ అలా చేయబోదని నేను అనుకుంటున్నా" అని ట్రంప్ అన్నారు.

గతవారం ట్రంప్ శ్వేతసౌధంలో మాట్లాడుతూ.. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ క్రమంలో మోదీతో తాను మాట్లాడానని, మాస్కో నుంచి చమురు కొనుగోలు నిలిపివేస్తానని ప్రధాని తనకు హామీ ఇచ్చినట్లు చెప్పారు. దీనిపై భారత్ స్పందించింది. ట్రంప్-మోదీల మధ్య అలాంటి సంభాషణ ఏదీ జరగలేదని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ స్పష్టం చేశారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో దేశ ప్రజల ప్రయోజనాలను కాపాడటమే తమకు ముఖ్యమని పునరుద్ఘాటించారు. మరోవైపు, భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చల్లో పురోగతి లభించినట్లు తెలుస్తోంది. ఈ చర్చలకు సంబంధించి -మిగతా 2లో

## ఏపీలో 2024 జనవరి 1 నుంచి డీఏ పెంపు.. జీవో జారీ




(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 20)

ఉద్యోగులు, పింఛనర్లకు దీపావళి కానుకను ఏపీ రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఉద్యోగులకు డీఏ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. డీఏను 3.64 శాతం పెంచుతూ ఆదేశాలిచ్చింది. ఈ పెంపు 2024 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొంది. రెగ్యులర్ ఉద్యోగుల వేతనంలో ఇప్పటి వరకు డీఏ శాతం 33.67 ఉండగా.. అది 37.31 శాతానికి పెరగనుంది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

## ఆర్టీసీ ఉద్యోగుల్లో వెలుగులు నింపేలా కూటమి ప్రభుత్వం చర్యలు




(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 20)

ఉద్యోగులకు న్యాయం చేసే దిశగా సీఎం చంద్రబాబుతీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిఅన్నారు. దీపావళి సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం పదోన్నతులు కల్పించి.. వారి జీవితాల్లో వెలుగులు నింపిందని తెలిపారు. ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, ఆర్టిసన్స్‌కు పదోన్నతులు ఇచ్చినట్లు వివరించారు. పనిష్‌మెంట్లు, పెనాల్టీలు ఉన్నా.. ప్రమోషన్స్ ఇచ్చినట్లు తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమమే ప్రాధాన్యతగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

## వైకాపా హయాంలో ఒక్క డీఏ అయినా ఎందుకు ప్రకటించలేదు?: యనమల




## ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా విశాఖ: నారా లోకేశ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 20)

ఆంధ్రప్రదేశ్‌లో అనుభవం కలిగిన సమర్థ నాయకత్వం ఉందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో నిర్వహించిన సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ రోడ్‌షోలో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వల్ల ఏపీకి భారీగా పెట్టుబడులు -మిగతా 2లో



## మిగిలిన మావోయిస్టులంతా దక్షిణ బస్తర్‌లోనే..?



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 20)

ఓ వైపు ఎన్‌కౌంటర్లు.. మరోవైపు లొంగుబాట్లతో మావోయిస్టు పార్టీ ఉనికి రోజురోజుకూ పరిమితమైపోతోంది. ఒకప్పుడు దండకారణ్యంలో జనతన సర్కార్ పేరిట సమాంతర పాలన సాగించిన మావోయిస్టులు.. ప్రస్తుతం ప్రాణాలతో ఉంటే చాలనుకునే పరిస్థితి నెలకొంది. పార్టీలో నంబర్-2 స్థానంలో కొనసాగిన పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావు, దాదుల వ్యూహకర్త ఆశన్న లొంగుబాటుతో పార్టీకి తీవ్రనష్టం వాటిల్లింది. వారిద్దరూ ఆయుధాలతో సహా దాదాపు 280 మంది కేడర్‌ను తమ వెంట తీసుకురావడంతో దండకారణ్యంలో పలు ప్రాంతాలు ఖాళీ అయినట్లైంది. ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలోని కేడర్ మల్లోజుల వెంట వెళ్లగా.. ఉత్తర బస్తర్‌లోని కేడర్ దాదాపుగా ఆశన్నతో కలిసి నడిచింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మావోయిస్టుల ఉనికి కేవలం దక్షిణ బస్తర్ ప్రాంతానికే పరిమితమైంది. బస్తర్ జిల్లా కేంద్ర స్థానమైన జగదల్‌పుర్‌కు దక్షిణాన ఉన్న బాకావండ్, లోహండిగూడ, తోకపాల్, దర్భ, సుక్మా, బీజాపుర్ ప్రాంత అడవుల్లో ప్రస్తుతం తలదాచుకున్నట్లు నిఘావర్గాలు అనుమానిస్తున్నాయి. తెలంగాణను ఆనుకొని ఉన్న కర్రెగుట్టలను స్థావరంగా చేసుకొని ఉంటారని భావిస్తూ అటువైపే దృష్టిసారించినట్లు కనిపిస్తోంది. 'ఛత్తీస్‌గఢ్‌లో ఒకప్పుడు మావోయిస్టులకు బేస్‌గా ఉన్న అబూజ్‌మడ్, ఉత్తర బస్తర్ ఇప్పుడు నక్సల్‌రహితమైపోయాయి. దక్షిణ బస్తర్‌లో మాత్రమే వారి ఉనికి ఉంది. త్వరలోనే అక్కడా తుడిచిపెట్టేస్తాం..' అని రెండు రోజుల క్రితం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కూడా ప్రకటించారు. -మిగతా 2లో

## నార్త్ సౌత్ వేల్స్ యూనివర్సిటీని సందర్శించిన మంత్రి లోకేశ్.. ఏఐ, రెన్యూవబుల్ ఎనర్జీ రంగాలపై చర్చ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 20)

మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియా పర్యటన కొనసాగుతోంది. సిడ్నీ రాండ్విక్‌లోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ సౌత్ వేల్స్(యూఎన్ఎస్‌డబ్ల్యూ)ను ఆయన సందర్శించారు. వర్సిటీ ప్రతినిధులు మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం పలికారు. అధునాతన బోధనా పద్ధతులు, టీచర్ ట్రైనింగ్, రెన్యూవబుల్ ఎనర్జీపై సీనియర్ ఎగ్జిక్యూటివ్స్, పరిశోధకులతో మంత్రి చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాలతో కలిసి జాయింట్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు, స్టూడెంట్ ఎక్స్ఛేంజి పథకాలను ప్రారంభించాలని కోరారు. ముఖ్యంగా కృత్రిమ మేధ, రెన్యూవబుల్ ఎనర్జీ రంగాలపై -మిగతా 2లో

# 'కసమ్ సిందూర్‌కి'..ఆపరేషన్ సిందూర్‌పై నేవీ గానం..



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 20)

ప్రధాని నరేంద్రమోదీ సోమవారం గోవా తీరంలో నౌకాదళ సిబ్బందితో దీపావళి వేడుకలు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నౌకాదళ సిబ్బంది ఆపరేషన్ సిందూర్‌పై రాసిన ఓ పాటను ప్రధాని ఎదుట పాడారు. దానికి సంబంధించిన వీడియోను మోదీ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఆదివారం రాత్రి స్వదేశీ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటానని పేర్కొన్నారు. నావికా దళ సిబ్బంది ప్రతిభావంతులని.. సృజనాత్మకత కలిగిన వారని ప్రశంసించారు. వారు రాసిన 'కసమ్ సిందూర్‌కి' గీతం ఎప్పటికీ తన హృదయంలో నిలిచిపోతుందని అన్నారు.

ఈ పాటలో పహల్గాం ఉగ్రదాడి, అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ లో త్రివిధ దళాలు కలిసి ఉగ్ర స్థావరాలపై జరిపిన దాడులు, ఉగ్రస్థావరాలను సమూలంగా నాశనం చేసిన భారత స్వదేశీ క్షిపణులు వంటి వివిధ విషయాలను ప్రస్తావించారు.

**'విక్రాంత్'పై మోదీ దీపావళి వేడుకలు**

గోవా తీరంలో నౌకాదళ సిబ్బందితో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దీపావళి వేడుకలు చేసుకున్నారు. ఆదివారం రాత్రే స్వదేశీ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌కు వెళ్లిన ప్రధాని.. ఈ ఉదయం నేవీ సిబ్బందితో వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని ప్రసంగిస్తూ.. పాకిస్థాన్‌పై విరుచుకుపడ్డారు. 'ఐఎన్ఎస్ విక్రాంత్' దాయాదికి నిద్రలేని రాత్రులు మిగిల్చిందన్నారు.

# నకిలీ సమాచారం కట్టడికి కొత్త చట్టం తెస్తాం: సీఎం సిద్ధరామయ్య



(షణ్ముఖ వెలుగు, కర్నాటక,అక్టోబర్ 20)

నకిలీ సమాచారంవ్యాప్తిని కట్టడి చేసేందుకు నూతన చట్టాన్ని తీసుకొస్తామని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ప్రకటించారు. ఏ జిల్లా అయినా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే.. మత సామరస్యమే ముఖ్యమన్నారు. సోమవారం మంగళూరు సమీపంలోని పుత్తూరులో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. "తప్పుడు సమాచారం వ్యాప్తికి అడ్డుకట్ట వేసేందుకు మేం ఓ చట్టాన్ని తీసుకొస్తున్నాం. తప్పుడు సమాచారం వ్యాప్తి చేసేవారిపై, ప్రజలకు నకిలీ సమాచారం అందించడం ద్వారా మత సామరస్యాన్ని దెబ్బతీసేవారిపై కేసులు నమోదు చేస్తాం" అని హెచ్చరించారు. ఈ మేరకు నూతన చట్టం రూపొందించాలని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్‌ను సీఎం ఆదేశించారు. ఐటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే, పాటిల్ ఈ చట్టం రూపొందించేందుకు కృషిచేస్తారన్నారు. మత సామరస్య ఆవశ్యకతను సిద్ధరామయ్య నొక్కి చెప్పారు. దక్షిణ కన్నడ ప్రజలు మత సామరస్యాన్ని కాపాడుకోవడంపై దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు. మత సామరస్యాన్ని ఎవరు దెబ్బతీస్తున్నారో తాను చెప్పబోనన్న సీఎం.. అలా ఎవరు చేస్తున్నారో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# ప్రస్తుతం 3 జిల్లాల్లోనే మావోయిస్టుల ఉనికి

మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా దండకారణ్యాల్లో జరిపిన ఎన్‌కౌంటర్లలో అగ్రనాయకుల నుంచి అనేక మంది మావోయిస్టులు మరణించారు. ఈ పరిణామాలతో చాలా మంది ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో చేరుతున్నారు.

# శ్వేత సౌధంలో మళ్లీ మాటల యుద్ధం: పుతిన్ చెప్పిన దానికి ఒప్పుకోవాలని జెలెన్‌స్కీపై ట్రంప్ ఒత్తిడి

అధికారులను ఉటంకిస్తూ వాషింగ్టన్ పోస్ట్ కథనంలో పేర్కొంది. దొనెట్స్క్ ప్రాంతాన్ని మాస్కో సేనలు స్వాధీనం చేసుకోవడానికి దాదాపు 11 ఏళ్ల నుంచి వివిధ రకాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నాయి. తాజాగా దీనిని తమకు అప్పగించి తీరాల్సిందేనని పుతిన్ పట్టుపడుతుండటంతో యుద్ధం కొనసాగుతోంది. ఈ ఏడాది మార్చిలో అమెరికా–ఉక్రెయిన్ ఖనిజాల ఒప్పందం సమయంలో ట్రంప్–జెలెన్‌స్కీ మధ్య మీడియా సాక్షిగా తీవ్రస్థాయిలో మాటల యుద్ధం చోటు చేసుకొంది. దీంతో అర్ధంతరంగా నాడు భేటీ, విందు రద్దయ్యాయి. నాడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యా– ఉక్రెయిన్‌ల మధ్య అత్యవసరంగా కాల్పుల విరమణ ఒప్పందం జరగాలని తాను కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. శాంతి చర్చలకు జెలెన్‌స్కీ తిరిగి వచ్చినప్పటికీ అందుకు తాను సిద్ధంగా లేనన్నారు. ఆ తర్వాత కొన్నాళ్లకు ఇరువురు చల్లబడ్డారు. తిరిగి ఖనిజాల ఒప్పందం చేసుకొన్నారు. అమెరికా నుంచి ఉక్రెయిన్‌కు ఆయుధాలు అందడం మొదలైంది.

# భారత్ అలా చెబితే.. భారీ టారిఫ్‌లు కట్టాల్సిందే: ట్రంప్ మరో హెచ్చరిక

ఇరుదేశాల మధ్య వైరుధ్యాలు చాలా వరకు సద్దుమణిగాయని, త్వరలోనే సానుకూల నిర్ణయం వెలువడే అవకాశం ఉందని భారత ప్రభుత్వ అధికారిక వర్గాలు వెల్లడించాయి. గతవారం కేంద్రమంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని బృందం వాషింగ్టన్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే.

# వైకాపా హయాంలో ఒక్క డీఏ అయినా ఎందుకు ప్రకటించలేదు?: యనమల

(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 20)

ఏపీ ప్రజలు ప్రస్తుత కూటమి ప్రభుత్వంతో సంతృప్తిగా ఉన్నారని తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. జగన్ పార్టీ మాత్రం రాజకీయంగా కష్టాల్లోకి దిగజారుతోందని పేర్కొన్నారు. "తన ప్రభుత్వంలో 4 డీఏలు ఎందుకు ఇవ్వలేదో జగన్ చెప్పాలి? కనీసం ఒక్క డీఏ అయినా ఎందుకు ప్రకటించలేదు? వైకాపా ప్రభుత్వం ఉద్యోగుల డిమాండ్లను పూర్తిగా విస్మరించింది. గత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక సంక్షోభాన్ని సరిదిద్దుతున్నాం" అని యనమల రామకృష్ణుడు తెలిపారు.

# ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా విశాఖ: నారా లోకేశ్

వస్తున్నాయని చెప్పారు. గత 16 నెలల్లో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు వెల్లడించారు. ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా విశాఖను తీర్చిదిద్దుతామన్నారు.

# మిగిలిన మావోయిస్టులంతా దక్షిణ బస్తర్‌లోనే..?

**హిడ్మా నేతృత్వంలోనే అగ్రనేతలు**

ప్రస్తుతం మావోయిస్టు పార్టీకి అగ్రనేత తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ, మాజీ సుప్రీం ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు ఎలియాస్ గణపతి పెద్దదిక్కుగా మిగిలారు. పీపుల్స్‌వార్‌తో కలిసి మావోయిస్టు పార్టీ అవతరించినప్పటి నుంచి కేంద్ర కమిటీలో కొనసాగుతున్న మరో కీలకనేత మిసిర్‌బెస్రా ఎలియాస్ సునిర్‌మాల్ ఝార్ఖండ్ గిరిధ్ ప్రాంతానికే పరిమితమైనట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) కార్యకలాపాల్లో సిద్ధహస్తుడిగా ముద్రపడిన మడావి హిడ్మా నేతృత్వంలోనే దేవ్‌జీ, గణపతిలాంటి అగ్రనేతలు దక్షిణ బస్తర్‌లో ఆశ్రయం పొందుతున్నారని నిఘావర్గాల అనుమానం.

# నార్త్ సౌత్ వేల్స్ యూనివర్సిటీని సందర్శించిన మంత్రి లోకేశ్.. ఏఐ, రెన్యూవబుల్ ఎనర్జీ రంగాలపై చర్చ

దృష్టి సారించి, ఆంధ్రప్రదేశ్ యువతకు అధునాతన టెక్నాలజీల్లో శిక్షణ ఇచ్చే నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించాలన్నారు. ఏపీలో పర్యావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు స్థిరమైన వ్యవసాయం, నీటి నిర్వహణ అంశాల్లో ఏపీ వర్సిటీలతో కలిసి సంయుక్త పరిశోధనలు చేపట్టాలని సూచించారు. "సోలార్, విండ్ పవర్ టెక్నాలజీల్లో యూఎన్ఎస్‌డబ్ల్యు నైపుణ్యాన్ని వినియోగిస్తూ.. పునరుత్పాదక శక్తి పరిశోధనల్లో ఏపీ వర్సిటీలతో కలిసి భాగస్వామ్యం వహించాలి.

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక స్టార్టప్స్‌ను ప్రోత్సహించడానికి యూఎన్ఎస్‌డబ్ల్యు మైఖేల్ క్రౌచ్ ఇన్నోవేషన్ సెంటర్ మద్దతుతో ఆవిష్కరణ కేంద్రాలను నెలకొల్పాలి. రాష్ట్రంలోని ఐటీ, తయారీ రంగాలతో భాగస్వామ్యం వహించి.. సంయుక్త పరిశోధన, అభివృద్ధి, సాంకేతిక మార్పిడి కార్యక్రమాలను బలోపేతం చేయాలి. గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సేవలను సులభంగా అందుబాటులోకి తెచ్చేందుకు టెలీ మెడిసిన్ ప్రజారోగ్య కార్యక్రమాల్లో భాగస్వామ్యం వహించాలి. ఆంధ్రప్రదేశ్ వైద్య సంస్థలతో కలిసి అంటు వ్యాధులు, మెటర్నల్ హెల్త్‌పై సంయుక్త పరిశోధనలు చేపట్టాలి. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, స్థిరమైన పట్టణ అభివృద్ధిపై కలిసి పనిచేయాలి. సమర్థమైన, డేటా ఆధారిత పరిపాలన, పబ్లిక్ పాలసీలపై యూఎన్ఎస్‌డబ్ల్యు నైపుణ్యాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పంచుకోవాలి" అని వర్సిటీ ప్రతినిధులను మంత్రి లోకేశ్ కోరారు.

# 'బీహార్ ఎన్నికలకు కర్ణాటక నిధులు'.. భాజపా ఆరోపణలపై కాంగ్రెస్ ఫైర్



(షణ్ముఖ వెలుగు, కర్నాటక,అక్టోబర్ 20)

బీహార్ ఎన్నికల వేడిక కర్ణాటకనూ తాకింది. అక్కడి ఎన్నికల్లో గెలుపు కోసం అధికార కాంగ్రెస్ ప్రభుత్వం కర్ణాటకను ఏటీఎంలా వాడుకుంటోందని భాజపా ఆరోపించింది. ఆ పార్టీ ఎంపీలు జగదీశ్ షెట్టర్, బీవై రాఘవేంద్ర చేసిన ఈ ఆరోపణలపై కాంగ్రెస్ కూడా దీటుగానే బదులిచ్చింది. సీఎం సిద్ధ రామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వారిపై విమర్శలు గుప్పించారు.

బిహార్ ఎన్నికల కోసం కేబినెట్‌లోని అందరు మంత్రులు అధికారులకు టార్గెట్లు నిర్దేశించి అవినీతి సొమ్మును బిహార్‌కు తరలిస్తున్నారని ఎంపీ రాఘవేంద్ర అన్నారు. ఈ మధ్య కాలంలో మంత్రులందరికీ ఇదే ప్రధాన వ్యాపారంగా మారిందని వ్యాఖ్యానించారు. జగదీశ్ షెట్టర్ సైతం ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. కేబినెట్ మంత్రులతో సీఎం సిద్ధరామయ్య డిన్నర్ మీటింగ్ పెట్టి బిహార్ ఎన్నికలకు నిధులు సమకూర్చే విషయంలో లక్ష్యాలు నిర్దేశించారంటూ ఆరోపించారు. కాంగ్రెస్ హైకమాండ్ కర్ణాటకను ఏటీఎంలా వాడుకుంటోందన్నారు. భాజపా నేతలు చేసిన ఆరోపణలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సీఎం సిద్ధ రామయ్య స్పందించారు. కర్ణాటక నుంచి 5 పైసలు కూడా బిహార్ ఎన్నికలకు వెళ్లలేదన్నారు. గతంలో వారు చేసిన పనిని తమపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆరోపణలకు ఆధారాలుంటే చూపాలంటూ డీకే శివకుమార్ సవాల్ చేశారు. రాఘవేంద్ర నోరువిప్పితే అబద్ధాలేనని ఎద్దేవాచేశారు. బిహార్‌లో 243 స్థానాలకు నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. 14న ఫలితాలు వెలువడనున్నాయి.

# రియాజ్ పోలీసుల వద్ద ఆయుధాన్ని లాక్కుని కాల్పులకు యత్నించాడు: డీజీపీ శివధర్‌రెడ్డి

(షణ్ముఖ వెలుగు, హైదరాబాద్,అక్టోబర్ 20)

నిజామాబాద్‌లో పోలీసుల కాల్పుల్లో నిందితుడు రియాజ్ మృతిచెందిన ఘటనపై తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి స్పందించారు. రియాజ్ తప్పించుకుని పారిపోతూ పోలీసులపై మరోసారి దాడికి పాల్పడ్డాడని చెప్పారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడు.. బాత్‌రూంకు వెళ్లి తిరిగి వస్తూ దాడికి తెగబడినట్లు తెలిపారు.

"రియాజ్‌ను పట్టుకునేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు. వారి దగ్గరున్న ఆయుధాన్ని లాక్కుని కాల్పులకు యత్నించాడు. అప్రమత్తమైన పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో రియాజ్ చనిపోయాడు. ఆదివారం అతడిని పట్టుకునే క్రమంలో స్థానికుడు ఆసిఫ్‌పై దాడి చేశాడు. ఇవాళ మరో కానిస్టేబుల్‌ను గాయపరిచి పారిపోయేందుకు యత్నించాడు" అని డీజీపీ వెల్లడించారు.




**అన్ని విధాలుగా అండగా ఉంటాం..**

కానిస్టేబుల్ ప్రమోద్‌కుమార్‌కు పోలీసు శాఖ తరఫున నివాళులర్పిస్తున్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ప్రమోద్ కుమార్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని వెల్లడించారు. "రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ కట్టుబడి ఉంది. నేరస్థులు ఎంతటి వారైనా కఠినంగా అణచివేస్తాం. ప్రమోద్ కుటుంబానికి రూ. కోటి పరిహారం, 300 గజాల ఇంటి స్థలం అందిస్తాం. పోలీసు భద్రత, వెల్ఫేర్ బోర్డుల నుంచి రూ. 24 లక్షల పరిహారం ఇస్తాం. ప్రమోద్ కుటుంబ సభ్యుల్లో కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తా" అని డీజీపీ వెల్లడించారు. రియాజ్ మృతితో నిజామాబాద్‌లో స్థానికులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. నిందితుడు రియాజ్ చనిపోవడం పట్ల కానిస్టేబుల్ కుటుంబం హర్షం వ్యక్తం చేసింది. "బైకులు, బుల్లెట్ వాహనాల చోరీల్లో రియాజ్ సిద్ధహస్తుడు. ఇంజిన్ నంబర్లు మార్చి మహారాష్ట్రలో బైకులు అమ్మేశాడు. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ పీఎస్‌లలో రియాజ్‌పై కేసులు ఉన్నాయి. గత మూడేళ్లలో రియాజ్‌పై 40 కేసులు నమోదయ్యాయి. రియాజ్ మూడు సార్లు బెయిల్‌పై బయటికి వచ్చాడు" అని నిజామాబాద్ సీపీ సాయి చైతన్య తెలిపారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక
ప్రకాశం

# కంభం చెరువుకి జలకళ

## – నిండుకుండలా కంభం చెరువు – కంభం చెరువుపై ప్రత్యేక కథనం

(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 20)


ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో కంభం ప్రాంతంలో ఉన్న చారిత్రక కంభం చెరువు కేవలం నీటి వనరుగా కాకుండా, అద్భుతమైన నిర్మాణ కళకు, వేల ఏళ్ల వారసత్వానికి చిహ్నంగా నిలుస్తోంది. దీనిని గుండ్లకమ్మ చెరువు లేదా కంభం ట్యాంక్ అని కూడా పిలుస్తారు.



**విజయనగర వైభవం:**

ఈ చెరువు చరిత్ర విజయనగర సామ్రాజ్యం కాలానికి చెందింది. దీని నిర్మాణ ఘనత శ్రీకృష్ణదేవరాయల భార్య అయిన రాణి వరదరాజమ్మ (రుచిదేవి)కి దక్కుతుంది. రాణి వరదరాజమ్మ క్రీ.శ.1522 – 1524 మధ్య గుండ్లకమ్మ, జంపలేరు నదులు కలిసే లోయలో ఒక పటిష్టమైన ఆనకట్టను నిర్మించడం ద్వారా ఈ అద్భుతమైన జలాశయాన్ని సృష్టించారు.

**చారిత్రక రికార్డులు:**



ఆసియాలో అత్యంత పురాతనమైన మానవ నిర్మిత సరస్సులలో ఇది ఒకటిగా గుర్తింపు పొందింది. ఒకానొకప్పుడు, ఇది ఆసియాలో రెండవ అతిపెద్ద నీటిపారుదల ట్యాంక్ గా ప్రసిద్ధి చెందింది. 20వ శతాబ్దంలో కూడా ఈ స్థానాన్ని నిలుపుకుంది.


**నేటికీ రైతులకు జీవనాడి :**

చరిత్ర ఎంత గొప్పదైనా, నేటికీ కంభం చెరువు లక్షలాది మంది రైతులకు జీవనాడిగా ఉంది. ఈ చెరువు 3.38 టీఎంసీ (వేల మిలియన్ క్యూబిక్ అడుగులు) నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ నీరు స్థానిక వ్యవసాయానికి కీలకమైన నీటిపారుదల వనరుగా పనిచేస్తూ, సుమారు 10,300 ఎకరాల భూమికి సాగునీరు అందిస్తోంది. ఐదు శతాబ్దాలకు పైగా నిర్మించినప్పటికీ, కంభం చెరువు స్థానిక ఆర్థిక వ్యవస్థకు, ఆహార భద్రతకు అందిస్తున్న సహకారం అనిర్వచనీయం. ఇది గత వైభవానికి, నేటి అవసరాలకు వారధిగా నిలుస్తోంది. అంతే కాకుండా (తరువాయి 5లో...)

# ఎంపి వైవి సుబ్బారెడ్డిని కలిసిన మేడా బద్రీనాథ్

(షణ్ముఖ వెలుగు, హైదరాబాద్, అక్టోబర్ 20)

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు సభ్యులు వైవి సుబ్బారెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో వైసిపి ఇంటలేక్చువల్ విభాగం రాష్ట్ర సెక్రెటరీ, ఆర్యవైశ్య అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మేడా బద్రీనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. బొకే అందజేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



# సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కందుల సతీమణి కందుల వసంత లక్ష్మి




(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, అక్టోబర్ 20)

ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ హాస్పిటల్లో చేరి చికిత్స తీసుకొని ఆర్థిక పరిస్థితి బాగాలేక మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని కలిసి సీఎం సహాయ నిధికి పలువురు దరఖాస్తు చేసుకున్నారు. వారికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు ప్రభుత్వం విడుదల చేసింది. సోమవారం ఆ చెక్కులను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంత సహాయనిధి చెక్కులు (తరువాయి 5లో...)





# నగరంలో అట్టహాసంగా దీపావళి వేడుకలు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 20)**
ఒంగోలు నగరంలో ప్రజలు అట్టహాసంగా దీపావళి వేడుకలను నిర్వహించుకున్నారు. ప్రజలంతా పోలీసు అధికారుల సూచనల మేరకు బాణాసంచా కాల్చుకుని సంబరాలు చేసుకున్నారు. హైదరాబాద్‌లో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి బాణాసంచా కాల్చుకుని వేడుకలు జరుపుకున్నారు. అదే విధంగా ఒంగోలు నగరంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా సుధీర్ కుమార్ దంపతులు వారి కుటుంబ సభ్యులతో కలిసి శిద్దా నివాసం వద్ద బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

















# కంభం చెరువుకి జలకళ

నక్కలగండి దగ్గర ఉన్న అలుగు కంభం చెరువు పూర్తిగా నిండితే అలుగు పారుతుంది. ఒక్కసారి అలుగు పారితే మూడు సంవత్సరాల వరకు కంభం చెరువు కింద ఉన్న రైతుల పంట పొలాలకు సాగునీటి కొరత ఉండదని స్థానిక ప్రజలు చెబుతారు. అలుగు పారితే స్థానికుల సందడికి అక్కడి ప్రజల ఆనందానికి హద్దులు ఉండవు. పర్యాటకులు అలుగు దగ్గరికి భారీ సంఖ్యలో చేరుకొని అలుగు మరియు కంభం చెరువు అందాలను చూసి మురిసిపోతారు. ఇంకా కొన్నిరోజులు ఇలాగే వర్షాలు పడితే అలుగు పారుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.మంచు పడే సమయంలో మరియు సాయంత్రం వేళలో కంభం చెరువు అందాలు అందరినీ ఆకట్టుకుంటాయి. ఇంతటి గొప్ప పేరు ప్రాఖ్యాతలు గాంచిన కంభం చెరువును పర్యాటక కేంద్రగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.










# సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కందుల సతీమణి కందుల వసంత లక్ష్మి



మంజూరైన వారి కుటుంబ సభ్యులకు ఆమె స్వయంగా ప్రతి ఇంటికి వెళ్ళి వారి బాగోగులు తెలుసుకుని వారికి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. సహాయ నిధి చెక్కులు అందుకున్న వారిలో దేవరాజు గట్టు రవణ రూ.17,600, చెవుల వెంకటేశ్వర్లు రూ.51,309, పొందుగుల చిన్న అంజిరెడ్డి రూ.18,500, సయ్యద్ ఖాదర్ మున్నిస రూ.29,773, మలిపెద్ది నాగ వెంకట సత్యనారాయణ రూ.68,018, కుందూరు వెంకటేశ్వర్లు రూ.42,000, సయ్యద్ షాబీహ రూ.70,918, దోగిపర్తి అరుణ కుమారి రూ.1,02,429, ఇమ్మడి ఓబులమ్మ రూ.41,927, దియాల ఆదిలక్ష్మి రూ.67,038, గుత్తికొండ శ్రీనివాసరెడ్డి రూ.51,655 వెరసి మొత్తం రూ.5,51,567 చెక్కులను అందజేశారు.



# బాణాసంచా దుకాణాల వద్ద ఎస్ఐ నరసింహారావు ప్రత్యేక భద్రతా చర్యలు

## ప్రమాదాలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు





**(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 20)**

దీపావళి పండుగ సందర్భంగా కంభం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన తాత్కాలిక బాణాసంచా దుకాణాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా కంభం ఎస్ఐ నరసింహారావు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ప్రజల రక్షణే లక్ష్యంగా ఎస్ఐ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా దుకాణాల నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాల్సిన అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు, నిబంధనలను స్వయంగా పరిశీలించారు. ప్రతి దుకాణం వద్ద ఇసుక బకెట్లు, నీటి నిల్వ ట్యాంకులు, అగ్నిమాపక సిలిండర్లు అందుబాటులో ఉండేలా చూశారు. దుకాణాల వద్ద రద్దీని దృష్టిలో ఉంచుకుని అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ విక్రయాలు జరగకుండా ప్రత్యేక పోలీస్ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశారు. బాణాసంచా కొనుగోలు చేసేవారు మరియు కాల్చేవారు తప్పనిసరిగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్నపిల్లలను ఒంటరిగా బాణాసంచా కాల్చడానికి అనుమతించవద్దని, సురక్షిత ప్రాంతంలో మాత్రమే కాల్చాలని సూచించారు. ఎస్ఐ నరసింహారావు చొరవతో ఏర్పాటు చేసిన ఈ కట్టుదిట్టమైన భద్రతా చర్యల పట్ల పట్టణ ప్రజలు, దుకాణాల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సర్కిల్ ఇన్స్పెక్టర్‌ని సత్కరించిన టీడీపీ నేతలు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 20)**

పొదిలి సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాజేష్ కుమార్, ఎస్ఐ వి వేమనను పొదిలి మండల, పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందరంగా తెలుగుదేశం నాయకులు మాట్లాడుతూ పొదిలి సర్కిల్ పరిధిలోని ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని నాయకులు కోరారు. స్పందించిన సిఐ మాట్లాడుతూ తాను ప్రతిఒక్కరికి ఎప్పుడు అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చిన తన కార్యాలయంలో సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దోర్నాల అంజిరెడ్డి, పట్టణ అధ్యక్షులు ముల్లా ఖుద్దూస్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు), జిల్లా ముస్లిం మైనార్టీసెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ భాష, మాజీ శివాలయం ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, మాదాలవారిపాలెం సొసైటీ ప్రెసిడెంట్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఏలూరు సొసైటీ ప్రెసిడెంట్ ఉలవా గోపి, పొదిలి మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, సోమయ్య, తానికొండ వెంకట్రావు, జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి షేక్ షబ్బీర్, ఇతర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# పేదవారు ఆరోగ్యంగా ఉంటేనే సీఎం చంద్రన్నకు ఆనందం

## ఆనారోగ్యంతో బాధపడే వారికి ఆపన్న హస్తం ముఖ్యమంత్రి సహాయనిధి

### గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, అక్టోబర్ 20)

గిద్దలూరు నియోజకవర్గంలోని 100 మంది లబ్ధిదారులకు రూ,54,50,093లు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణి చేసారు ఎమ్మెల్యే ముత్తుముల. గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సోమవారం ఉదయం నియోజకవర్గంలో ఆనారోగ్యంతో బాధపడుతున్న వంద మందికి 8వ విడతగా మంజూరైన రూ. 54,50,093లు ముఖ్యమంత్రి సహాయ నిధి, చెక్కులను అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవారు ఆరోగ్యం ఉంటేనే సీఎం చంద్రన్నకు ఆనందం అని, ఆనారోగ్యంతో బాధపడే వారికీ ముఖ్యమంత్రి సహాయనిధి అనేది ఒక ఆపన్న హస్తం అని, పేదలకు నాణ్యమైన వైద్యం అందించటమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రస్తుతం పట్టణాల్లోని కార్పొరేట్ హాస్పిటల్స్‌లో పేదవారు నాణ్యమైన వైద్యం పొందవచ్చునని, వారికీ అయిన ఖర్చును ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పొందవచ్చునన్నారు.. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ అనేకమంది పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారని వారికీ అండగా నిలవాలన్నదే చంద్రన్న కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. పేద ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందిస్తుందన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలోని 440 మంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 4,64,97,216 -00 లు (అక్షరాల నాలుగు కోట్ల అరవై నాలుగు లక్షల తొంబై ఏడు వేల రెండు వందల పదహారు రూపాయలు) అందచేయటం జరిగిందన్నారు. ప్రభుత్వం చేసిన మేలును ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ సుంకాలను నిరసిస్తూ చిత్రపటం దగ్ధం

(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, అక్టోబర్ 20)

భారతదేశంపై సామ్రాజ్యవాధాధిపతి అయినటువంటి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాలను నిరసిస్తూ ట్రంప్ చిత్రపటాన్ని దగ్ధం చేశారు. మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అమెరికా సుంకాలను నిరసిస్తూ తక్షణమే భారత్‌పై విధిస్తున్న సుంకాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ట్రంపు ముఖచిత్రం ప్లే కార్డుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు. వీరు మాట్లాడుతూ భారతదేశం నుండి అమెరికాకు ఎగుమతి చేస్తున్న అనేక వస్తువులపై అమెరికా ప్రభుత్వం ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించినటువంటి 50% సుంకాలు అత్యంత దారుణమైన చర్యగా వర్ణించారు. అమెరికా దిగుమతులపై అదే స్థాయిలో సుంకాలు విధించకుండా స్వామి భక్తి చాటడాన్ని ప్రశ్నించారు. అమెరికాకు దాసోహమై కేంద్రం పరిపాలన చేయటం సిగ్గుచేటు అన్నారు చైనాపై అమెరికా అధ్యక్షుడు విధించిన సుంకాలకు దీటుగా అక్కడి ప్రభుత్వం స్పందించిందని మరి మన ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రపంచవ్యాప్తంగా పరస్పర ఆధారిత పై ప్రపంచం నడుస్తుందని కానీ మన దేశ ఉత్పత్తులను మన దేశ పరిశ్రమలను మన దేశ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నటువంటి అమెరికా విధానాలను పార్టీలకు అతీతంగా అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఎన్నడూ లేని విధంగా దూరవిద్యకు వెళ్లేటువంటి విద్యార్థులకు ఉద్యోగులకు 88 లక్షల రూపాయలు వీసా పెంచడం ద్వారా ఈ దేశ అభివృద్ధిని ప్రత్యక్షంగా మోడీ అడ్డుకుంటున్న విషయాన్ని గుర్తు చేశారు . ఈ ప్రపంచ దేశాలలో నిరంతరం యుద్ధాలు సృష్టించి దీని ద్వారా తన ఆయుధ సంపత్తిని మార్కెటింగ్ చేసుకుంటూ ఉత్పత్తిని పెంచుకుంటూ అనేక దేశాలకు నేడు శత్రువుగా ట్రంప్ వ్యవహరిస్తున్నాడని ఇది ప్రపంచ శాంతికి భగ్నం కలిగిస్తుందని తెలిపారు. ఇలాంటి దుర్మార్గమైనటువంటి ఆలోచన కలిగినటువంటి అమెరికా తో మోడీ ప్రభుత్వం సర్దుబాటు ధోరణిలోకి పోతుందని ట్రంపు ఎన్ని సుఖాలు వేసిన వాటిని వ్యతిరేకించ లేకుండా బలహీన పడినటువంటి ప్రభుత్వం కేంద్రంలో ఉందన్నారు. ఈ దేశ ఉత్పత్తులను పరిశ్రమలను ఉద్యోగ ఉపాధి కల్పన లో అమెరికా జోక్యం తగదన్నారు. తధార నిరుద్యోగం పరిశ్రమలు మూతపడటం రైతాంగం దివాలా తీయటం లాంటి పరిస్థితులు ఉద్భవిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అమెరికాకు దీటుగా సమాధానం చెప్పి తమ దేశభక్తిని చాటుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో చిన్నంరాజు నరసరాజు, యోహన్, వి రాములు, నారాయణ, గురునాథం, రాములు, జక్కుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.




# వెలిగొండ ప్రాజెక్ట్ పై నటిస్తున్న వైకాపా ప్రాజెక్ట్ పనులు జరుగుతుంది టీడీపీ ఆధ్వర్యంలోనే




(షణ్ముఖ వెలుగు,మర్కాపురం ఇన్‌చార్జి, అక్టోబర్ 20)

అధికారంలో ఉన్న గత ఐదేళ్లపాటు వెలిగొండ ప్రాజెక్టులో తట్ట మట్టి పోయకుండా, ఏ ఒక్క నిర్వాసితుడికి నష్టపరిహారం ఇవ్వకుండా ఈ ఏడాది వచ్చే ఏడాది అంటూ కాలయాపన చేసి నేడు ప్రాజెక్టుపై ఈ ప్రాంతంపై ప్రేమ ఉన్నట్లు నటించడం వైకాపా పార్టీకి చెందింది. వెలుగొండ ప్రాజెక్టు పనులు పురోగతిలో దూసుకుపోతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో అప్పుడైనా ఇప్పుడైనా వెలుగొండలో పనులు జరిగాయి అంటే అది తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలోనే జరిగాయి. దీనిపై ఎక్కడైనా ఎప్పుడైనా చర్చకు సిద్ధమన్నారు. 25 ఏళ్లుగా ఏ అభివృద్ధికి నోచుకోకుండా సర్వం కోల్పోయి కనీస అభివృద్ధి లేకుండా ముంపు గ్రామాల్లోనే నివాసం ఉంటూ నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నా మా గ్రామాల మీద అసత్య ప్రచారాలు చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు చేస్తూ తమ ఉనికిని కాపాడుకోవడానికి స్థానిక ఎమ్మెల్యే పిచ్చి పిచ్చి ఆరోపణలు చేయడం తగదన్నారు. నిర్వాసితులకు మంచి చేయాలనే ఉద్దేశం ఉంటే స్థానిక ఎమ్మెల్యేగా నష్టపరిహారం ఇప్పించే విధంగా అధికారులతో మాట్లాడాలి. అంతేగాని అక్కడ ఏదో జరుగుతుందని అసత్య ప్రచారాలు చేయడం ప్రజాప్రతినిధిగా మీకు తగదన్నారు. జరుగుతున్న ప్రాజెక్టు పనులు నిర్వాసితులకు నష్టపరిహారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

# ఆకలి తీరుస్తూ ఆదరణ చాటిన స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, అక్టోబర్ 20)

కనిగిరిలో స్నేహహస్తం ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి కనిగిరిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమం ద్వారా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, వారి బంధువులకు, నిరాశ్రయులకు, మతిస్థిమితం లేని వృద్ధులకు ఆహారం అందించారు. ట్రస్ట్ అధ్యక్షులు సుధీర్ బాబు మాట్లాడుతూ ప్రతి సోమవారం గర్భిణీలు, బాలింతలు, డయాలసిస్ చేయించుకునే కిడ్నీ వ్యాధిగ్రస్తులు, పేద ప్రజలకు మా వంతు సేవ అందిస్తామన్నారు. ఆకలితో ఉన్న పేదవారికి, ఆహారం ఇవ్వడం మా బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది శంకర్, స్నేహహస్తం మిత్రులు లక్ష్మణాచారి, గౌస్, శివ శంకర్, బేబీ రాజ్, కోటి, తదితరులు పాల్గొన్నారు.

# పొదిలి శివాలయంలో సీఐ రాజేష్ దంపతుల పూజలు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 20)

పొదిలి శివాలయంలో నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజేష్ కుమార్ దంపతులు సోమవారం దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఒగ్గు వెంకట రామయ్య దంపతులు, ఆలయ అర్చకులు సిఐ రాజేష్ దంపతులను సాదరంగా ఆహ్వానించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య దంపతులు సిఐ రాజేష్ కుమార్ దంపతులకు పూలమాలలు వేసి పట్టు వస్త్రాలు అందజేసి అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# దగదర్తిలో ఆగ్రోస్ చైర్మన్, టీడీపీ నేత మాలేపాటి అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి డాక్టర్ స్వామి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 20)
నెల్లూరు జిల్లా దగదర్తిలో ఆగ్రోస్ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత మాలేపాటి సుబ్బానాయుడు అంత్యక్రియలో సోమవారం రాష్ట్ర సాంఘీ, సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పాల్గొన్నారు. సుబ్బానాయుడు మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యుల్ని మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ సుబ్బానాయుడు మృతి బాధాకరమని పేర్కొన్నారు. సుబ్బానాయుడు పార్టీకి చేసిన సేవలు ఎనలేనివి, ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. సుబ్బానాయుడు కావలి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. సుబ్బానాయుడు మృతితో నిబద్ధత, అంకితభావం కలిగిన కుటుంబ సభ్యున్ని టీడీపీ కోల్పోయిందన్నారు. సుబ్బానాయుడు కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి స్వామి హామీ ఇచ్చారు.







# చెంచుపాలెం గ్రామంలో మెడికల్ క్యాంపు








(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, అక్టోబర్ 20)
మాలపాడు గ్రామ పంచాయితీ చెంచుపాలెం గ్రామం నందు మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలో ప్రత్యేక పారిశుధ్యంలో భాగంగా బ్లీచింగ్, సున్నం చల్లించి మురుగు కాలువల పై ఏబెటు స్ప్రే చేయించి ప్రతి ఇంటిలో ఫీవర్ సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రవికిరణ్ డిప్యూటీ ఎంపీడీఓ యు సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి జె రవిబాబు, సిహెచ్ఓ భాస్కర్‌రావు, సూపర్వైజర్లు సురేష్, శ్రీనివాస్, సుజాత ఎంఎల్‌హెచ్‌పి ఉషా, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# డీఏ జిఓను తక్షణం సవరించాలి

## యుటిఎఫ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 20)
యుటిఎఫ్ సంఘం, ఇతర ఉపాధ్యాయ సంఘాల పోరాటాల ఫలితంగా స్వయంగా ముఖ్యమంత్రి గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ తో చర్చించి ఇచ్చిన జీవోలను 60, 61 ను తక్షణమే సవరించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రకాశం జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి వీరాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 20వ తేదీన రాష్ట్ర ఆర్థిక శాఖ జీవో నెంబర్ 60 ఉద్యోగులకు జీవో నెంబర్ 61 పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఒక డిఏ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి, గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్, అధికారులతో చర్చించే సందర్భంలో కనీస ప్రస్తావనకు రాని అంశాలను డీఏ జీవోలలో ప్రస్తావించడాన్ని యుటిఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఈ డి ఏ జీవో ద్వారా వచ్చే అరియర్స్ ఉద్యోగ విరమణ చేసిన తర్వాత చెల్లిస్తామని చెప్పడం పట్ల తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నామని తెలిపారు సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి జీవోలను ఎక్కడ ప్రస్తావించకపోవడం సరికాదని తెలిపారు ఉద్యోగ విరమణ చేసిన వారికి 2027-28 ఆర్థిక సంవత్సరంలో 12 వాయిదాలలో బకాయిలు చెల్లిస్తామని

చెప్పడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు ఇవ్వవలసిన రాష్ట్ర ప్రభుత్వం ఒక డిఏ మాత్రమే విడుదల చేసి ఆ డి ఏ చెల్లింపులు కూడా ఇంత గంత గోళం చేయడానికి ఉద్యోగ ఉపాధ్యాయులు మోసం చేయడమేనని యుటిఎఫ్ విమర్శించింది ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 60, 61వ తక్షణమే సవరణ చేసి ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు

డిఏ అరియర్స్ వారి పీఎఫ్ ఖాతాలకు సిపిఎస్ ఉద్యోగులు పెన్షనర్స్ కు తక్షణ సోము రూపంలో చెల్లించాలని డిమాండ్ చేసారు.



# దీపావళి వేళ రాష్ట్రపతితో ప్రధాని మోదీ భేటీ

(షణ్ముఖ వెలుగు,ఢిలీ,అక్టోబర్ 20)
దీపావళి వేడుకల నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో ప్రధాని నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి రాష్ట్రపతికి పుష్పగుచ్ఛం అందజేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలను రాష్ట్రపతి ‘ఎక్స్’లో పోస్టు చేశారు. అంతకుముందు ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కుటుంబ సభ్యులు, దిల్లీ సీఎం రేఖా గుప్తా తనను కలిసి దీపావళి శుభాకాంక్షలు చెప్పిన ఫొటోలను సైతం రాష్ట్రపతి షేర్ చేశారు.

# రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత: ధూళిపాళ్ల నరేంద్ర

(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 20)
రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుందన్నారు. సోమవారం పొన్నూరు మండలం మునిపల్లె గ్రామంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో 40 మంది రైతులకు తైవాన్ ఇంజిన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో యంత్ర పరికరాలను రైతులకు కాకుండా వైకాపా నేతలకే పంపిణీ చేశారని ఆరోపించారు.



# సీఐ రాజేష్‌కు సన్మానం




(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 20)
పొదిలి నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన రాజేష్‌ను సోమవారం తన కార్యాలయంలో ఏపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ స్వర్ణగీత మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు), తానికొండ వెంకట్రావు, పొదిలి పట్టణ ముస్లిం మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ఖాసీం, కంచర్ల శ్రీనివాసులు, పీవీ సురేష్ బాబు, చల్ల హరి, తదితరులు పాల్గొన్నారు.

# వీల్ చైర్ అందచేసిన ఎమ్మెల్యే ముత్తుముల



(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 20)
మండలంలోని తురిమెళ్ళ గ్రామానికి చెందిన దివ్యాంగుడైన పీరావలికి గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వీల్ చైర్ ను అందచేశారు. ఈ సందర్భంగా కుటంబ సభ్యులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాదా సుభద్ర, నాగేశ్వరరావు, కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనూరు భూపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన దాదా





(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 20)
గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు, గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని కలిసి తెలుగుదేశం పార్టీ నాయకులు దీపావళి పర్వదినం సందర్భంగా శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంభం మండల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మండల స్థాయిలో అభివృద్ధి, రైతు సమస్యల పై మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్ష

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, అక్టోబర్ 20)




సంతమాగులూరు మండలంలోని పుట్టావారిపాలెం అతిథి గృహంలో సోమవారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండలంలోని అన్నీ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, సొసైటీ అధ్యక్షులు, నీటి సంఘం అధ్యక్షులు, సంబంధిత శాఖల అధికారులతో విస్తృత సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభంలో ఇటీవల పరమపదించిన మండల పార్టీ అధ్యక్షుడు గాడిపర్తి వెంకట్రావు చిత్రపటానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులతో చర్చిస్తూ, మండలంలోని పార్టీ కార్యకలాపాల పురోగతి, గ్రామ స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులు మరియు ప్రభుత్వ పథకాల అమలు పరిస్థితులపై సమీక్ష జరిపారు. పార్టీ శ్రేణులు ప్రజలతో అనుసంధానం పెంచి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని మంత్రి సూచించారు. అనంతరం మండలంలోని వ్యవసాయ సహకార సొసైటీ అధ్యక్షులు, వ్యవసాయ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో రైతు సమస్యలపై విస్తృత చర్చ జరిగింది. రాబోయే పంట సీజన్ దృష్ట్యా ఎరువులు, విత్తనాల సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని మంత్రి ఆదేశించారు. రైతులకు అవసరమైన ఇన్‌పుట్స్ సమయానికి అందేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, దానిలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం భాగంలో మండలంలోని ప్రతి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్ష జరిగింది. రోడ్లు, తాగునీరు, విద్యుత్, హౌసింగ్, స్మార్ట్ విలేజ్ ప్రాజెక్టులు వంటి అంశాలపై అధికారులు వివరాలు సమర్పించారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రాధాన్యత క్రమంలో పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. సమీక్ష అనంతరం మంత్రి గారు ఒక్కో గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలతో వ్యక్తిగతంగా సమావేశమై స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తలెత్తుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. పార్టీ బలోపేతం కోసం గ్రామ స్థాయి నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ కమిటీలు, మండల కమిటీ త్వరలో పూర్తి చేయాలని సూచించారు. సమీక్షా సమావేశంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



---

# ఆ ప్రాంతం అప్పగిస్తేనే ఉక్రెయిన్‌తో శాంతి ట్రంప్‌నకు తేల్చిచెప్పిన పుతిన్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 20)



ఉక్రెయిన్ లోని అత్యంత కీలకమైన ప్రాంతాన్ని తమకు అప్పగించాల్సిందేనని మాస్కో పట్టుబడుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ , రష్యా అధినేత పుతిన్ మధ్య గత వారం జరిగిన సుదీర్ఘ ఫోన్‌కాల్ సంభాషణలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చినట్లు శ్వేతసౌధం అధికారులను ఉటంకిస్తూ వాషింగ్టన్ పోస్ట్ కథనంలో పేర్కొంది. దొనెట్స్క్ ప్రాంతాన్ని మాస్కో సేనలు స్వాధీనం చేసుకోవడానికి దాదాపు 11 ఏళ్ల నుంచి వివిధ రకాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నాయి. తాజాగా దీనిని తమకు అప్పగించి తీరాల్సిందేనని పుతిన్ పట్టుపడుతుండటంతో.. యుద్ధం కొనసాగుతోంది.

ఇటీవల ఫోన్ కాల్‌లో పుతిన్ ఓ ప్రతిపాదనను ట్రంప్ ఎదుట ఉంచినట్లు తెలుస్తోంది. ఇప్పటి తమ సేనల ఆధీనంలో ఉన్న జపొరిజియా, ఖేర్సాన్ ఉక్రెయిన్‌కు అప్పజెప్పేందుకు సానుకూలతను వ్యక్తం చేశారు. దీనికి ప్రతిగా ఉక్రెయిన్ దొనెట్స్క్ ప్రాంతాన్ని సంపూర్ణంగా తమకు అప్పగించాలని కోరినట్లు వాషింగ్టన్ పోస్టు కథనంలో వెల్లడించింది. వాస్తవానికి అలాస్కాలో జరిగిన ట్రంప్-పుతిన్ భేటీతో పోలిస్తే తాజా ఫోన్‌కాల్‌లో రష్యా కొంత మెత్తబడినట్లు తెలుస్తోంది. అయితే అదే రోజు ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీతో కూడా ట్రంప్ భేటీ అయ్యారు. నాడు అమెరికా అధినేత విడుదల చేసిన ప్రకటనలో మాత్రం పుతిన్ డిమాండ్లను ప్రస్తావించలేదు. పుతిన్ డిమాండ్లపై ఉక్రెయిన్ లేదా ఐరోపా సానుకూలంగా లేనట్లు తెలుస్తోంది. ఎటువంటి ప్రయోజనం లేకుండానే.. శరీరంలోని ఓ భాగాన్ని ఇచ్చేసినట్లు ఉందని నిపుణులు అభివర్ణించారు. వాషింగ్టన్ పోస్టు కథనంపై క్రెమ్లిన్ లేదా వైట్‌హౌస్ స్పందించలేదు. ఇప్పటికే ఉక్రెయిన్‌లోని ఐదో వంతు భూభాగాన్ని రష్యా ఆక్రమించిన విషయం తెలిసిందే.

**భారత్ ఆపేసింది :** మరోవైపు ఉక్రెయిన్‌కు సరికొత్త ఆయుధాలు ఇచ్చే విషయంలో అమెరికా ఆచితూచీ వ్యవహరిస్తోంది. తోమహాక్ క్రూజ్ క్షిపణులే లక్ష్యంగా అగ్రరాజ్య పర్యటనకు వచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి నిరాశ ఎదురైంది. ట్రంప్‌తో శుక్రవారం వాషింగ్టన్‌లో జరిపిన చర్చల్లో తోమహాక్ క్షిపణుల సరఫరాపై అమెరికా నుంచి ఎలాంటి హామీ లభించలేదు. రష్యా, ఉక్రెయిన్‌లు వెంటనే యుద్ధం ఆపాలన్న ప్రకటనతోనే ట్రంప్ సరిపుచ్చారు. దాదాపు 2,500 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం గల తోమహాక్‌లను తమకు అమెరికా సరఫరా చేస్తే రష్యా సైనిక లక్ష్యాలపై దాడి చేసి.. ఆ దేశాన్ని శాంతి ఒప్పందంపై సంతకం చేసేలా ఒత్తిడి తెస్తామని ఉక్రెయిన్ గత కొంతకాలంగా చెబుతోంది.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com